# జాతకఫలం

"నర్స్!"

"యస్ డాక్టర్ !"

"నంబరు 8 గదిలో పేషెంట్ జాగ్రత! 15 రోజులక్రితం మన నర్సింగ్‌హోమ్‌లో లేడీ పేషెంట్ చనిపోయింది-గుర్తుందా! సరిగ్గా అదే జ్వరం. జాగ్రత్తగా కనిపెట్టి వుండాలి నువ్వు. నేనిచ్చిన మందులు గంట గంటకి వెయ్యి. ప్రతి అరగంటకి పల్సులో ఏదైనా మార్పు ఉందేమో పరీక్ష చెయ్. తెల్లవారుజామున నాలుగ్గంటలకి వచ్చి నేను మళ్ళీ ఇంకో ఇంజెక్షన్ ఇస్తాను" అని ఆదేశించి డాక్టరుగారు వెళ్ళిపోయారు. నేను నంబరు 8 గదివయిపు నడిచాను.

గదిలో లైటు వెలుగుతోంది. మంచంమీద వున్నరోగి తీవ్రంగా మూలుగుతున్నాడు. భరించలేని అశాంతితో అటు ఇటు చేపపిల్లలా కొట్టుకుంటున్న అతన్ని చూస్తుంటే జ్వరం తీవ్రంగా వుందని స్పష్టంగా తెలుస్తోంది.

నేను వెళ్ళి నిశ్శబ్దంగా ప్రక్కనున్న కుర్చీలో కూర్చున్నాను. పల్స్ చూడటానికి చేయి అందుకుంటే వెచ్చగా కాలిపోతోంది.

"అబ్బా! ప్రాణం పోతుంది. దాహం, నాలుక పిడచ కట్టుకు పోతోంది."

గ్లూకోస్ నీళ్ళు తెచ్చి రెండు మూడు చెంచాలు అతని నోటికి అందిచ్చాను.

క్షణంసేపు అతని మూలుగు ఆగిపోయింది. నాలుకతో పెదవులు తడుపుకుంటూ పడుకున్నాడు.

అప్పటివరకూ రెప్పవాల్చకుండా అతని వైపు చూస్తున్న నాకు అతన్ని గుర్తుపట్టిన కొద్దీ క్రమంగా గుండెలు కొట్టుకోవడం మొదలు పెట్టాయి. నిజమా! ఇది సంభవమా! లేక నా కళ్ళు భ్రమిస్తున్నాయా- అన్పించసాగింది.

కొదిసేపు శాంతించిన అతని శరీరంలో మళ్ళీ ఆరాటం మొదల యింది. చేతులు కొట్టుకున్నాయి. ఒళ్ళంతా తీగెలా సాగింది. మళ్ళీ మూలుగు ప్రారంభమయింది.

చెదిరిపోయిన దుప్పటిని సరిచేస్తున్న నన్ను అతను కళ్ల తెరచి చూస్తూ "నర్స్!" అన్నాడు.

"మీరు శాంతంగా పడుకోటానికి ప్రయత్నం చేయండి" అన్నాను.

గిలగిలా కొట్టుకుంటున్న అతని చేతులు హఠాత్తుగా వచ్చి నా రెండు చేతుల్ని గట్టిగా పట్టుకున్నాయి. జ్వరంతో ఎరుపెక్కి తీక్షణంగా వున్న కళ్ళతో "నర్స్! నిజం చెప్పు. నాకీ జ్వరం నయం అవుతుందా?" అన్నాడు.

"నయం అవుతుంది."

"మీ నర్సులు, డాక్టర్లు అంతా అలాగే చెప్తారు! అలా చెప్పకపోతే ఇంకెలా చెప్తారు మరి?" పట్టుకున్నంత హఠాత్తుగా మళ్ళీ అంత వేగంగా నా చేతులు తోసేశాడు.

"మీరు నిద్రపోవాలి. మీకు విశ్రాంతి చాలా అవసరం."

"ఎలా నిద్రపోనూ, నా ఒళ్ళంతా మంటల్లో కాల్చినట్టుంటే? ఎము కల్ని పిండి పిండిగా విరక్కొట్టినట్టుంది! నిద్ర ఎలా వస్తుంది?"

"ఆ సంగతి నాకు మాత్రం తెలియదూ! ఆరోగ్యంగా, విశ్రాంతిగా వుంటే, ఈ నర్సింగ్ హోమ్‌కి రావల్సిన అవసరం ఏముంటుంది?"

"నర్స్! ఒకవేళ-ఒకవేళ-నా ప్రాణం పోతే?"

"పోదు."

"పోదని నీ కెలా తెలుసు? నాకెప్పుడూ ఇలాంటి జ్వరం, ఇంత

తీవ్రంగా ఏనాడూ రాలేదు. నర్స్! నేను-నేను చావుకి భయపడుతున్నానని అనుకోకు. పుట్టిన తర్వాత ఎప్పుడో ఒకప్పుడు చావక తప్పదు. కాని-కాని నాకిద్దరు పిల్లలున్నారు. అభం శుభం తెలియని చిన్నపిల్లలు. నా భార్య కూడా ఒట్టి అమాయకురాలు. ఈ ప్రపంచపు పోకడ అర్థం చేసుకోలేని మూర్ఖురాలు. వాళ్ళకోసం-వాళ్ళకోసమే నేను బ్రతకాలి."

దుప్పటి అంచులు సరిచేస్తున్న నా చేతులు దాన్ని గట్టిగా బిగుసుకున్నాయి. నా మనసులో కలిగిన ఉద్విగ్నమయిన భావాన్ని నిగ్రహించుకోవటానికి పెదవుల్ని పంటితో గట్టిగా నొక్కిపట్టాల్సి వచ్చింది. అతని మాటలు వింటున్నకొద్దీ క్రమంగా నాలోని శక్తిని అజ్ఞాతశక్తి ఏదో హరించటం ప్రారంభించింది.

"చెప్పు నర్స్! మాట్లాడవేం? అలా తలవంచుకుని నిలబడావెందుకు? నిజం చెప్పు; నాకేం ఫర్వాలేదా? డాక్టర్ ఏమన్నాడు? ఇది విషజ్వరమని, దీనివల్ల చాలామంది చనిపోయారని నాకు తెలుసు. నిజంగా నాకు తగ్గుతుందా? మళ్ళీ నా యీ కళ్ళతో సజీవంగా నా భార్యా పిల్లల్ని చూడగలనా?"

నేను సమాధానం చెప్పలేదు అదే ఇంకో వ్యక్తి అయితే నర్సుగా నేను చాలా ఆప్యాయంగా మాట్లాడేదాన్ని. కానీ-యీ వ్యక్తి-ఇతను వేరు. ఇతనిముందు పెదవి కదిపే శక్తి కూడా నాలో లేదు.

"ఊరుగాని ఊళ్ళో, నా అనేవాళ్ళు లేని ఈ ప్రదేశంలో-ఏదో పని మీద వచ్చిన నాకు, నా కేదయినా అయితే?" అతని కనుబొమలు ఆలోచనా పూర్వకంగా ముడిపడ్డాయి. క్షణం ఆగి మళ్ళీ చటుక్కున నా చెయ్యి అందుకుంటూ "నర్స్! ఒకవేళ-ఒకవేళ నా ప్రాణంపోతే-తర్వాత-నాభార్యకి ఆఖరిక్షణంలో తననే తలుచుకుంటూ ప్రాణం వదిలానని చెప్పు. చెప్తావు కదూ! తప్పకుండా చెప్తానని వాగ్దానం చెయ్యి." అన్నాడు.

అతనివైపు వెర్రిగా చూసిన నేను "డాక్టర్ని పిలుచుకు వస్తాను" అంటూ నా చేతిని గుంజుకుని మరుక్షణంలో సుడిగాలిలా బైటికి పరుగెత్తాను.

అరగంట తర్వాత డాక్టరు ఇచ్చిన ఇంజెక్షన్‌తో అతని కళ్ళు మూతలు పడిపోయినాయి.

డాక్టరు గదిలోంచి వెళ్ళబోతూ "జాగ్రత్త,పది నిమిషాలకి ఓసారి పల్స్ కౌంట్ చేసుకో. ఒకవేళ నువ్వు నిద్రకి ఆగలేకపోతే 12 గంటల తర్వాత ఇంకో నర్స్‌ని తీసుకొచ్చి కూర్చోపెట్టు" అని హెచ్చరించి వెళ్ళిపోయాడు.

ఆయన్ని సాగనంపి తిరిగివచ్చి కుర్చీలో కూలబడ్డాను. అంత క్రితం వరకూ తనంత ఖంగారుపడి నన్ను ఖంగారుపెట్టిన అతను పసి పిల్లవాడిలా తల ప్రక్కకువాల్చి నిద్రపోతున్నాడు. నిద్రలో కూడా, ఆ ముఖంలో, ఆ పడుకునే తీరులో అస్వస్థత, జ్వరతీవ్రత కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. అతనివైపు అలా చూస్తుండగానే క్రమంగా నా కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి. చాలా సేపటినుంచి బలవంతాన నిగ్రహించుకుంటున్న దుఃఖం ఒక్కసారి వెల్లువలా పొంగింది. రెండుచేతుల్లో ముఖం దాచుకుని నిశ్శబ్దంగా రోదించసాగాను. "భగవాన్! నేనేం పాపంచేశాను? నా కెందుకి శిక్ష" అన్పించటం మొదలుపెట్టింది.

కొద్దిసేపయింతర్వాత డాక్టర్ హెచ్చరిక గుర్తురాగానే ఉలిక్కిపడి అలా వెక్కిళ్ళమధ్యనే చెయ్యితీసుకుని నాడిపరీక్ష చేశాను. మార్పేమీ కన్పించలేదు. స్పృహలేని ఆ చేతిని వెంటనే వదల్లేక అలాగే పట్టుకుని చూస్తుండిపోయాను. మళ్ళీ కళ్ళనిండా నీళ్ళు నిండినాయి. దాదాపు 10 సంవత్సరాల క్రితం యీచెయ్యి నాచేతిని పట్టుకుని అగ్నిచుట్టూ తిరిగింది. మరోచేతో కలిసి పవిత్రమైన మాంగల్యం నా మెడలో ముడి వేసింది.

"నా కిద్దరు పిల్లలున్నారు. నాభార్య ఒట్టి అమాయకురాలు" వాడి శూలాల్లావచ్చి గుచ్చుకున్నాయి ఆ మాటలు. అవి గుర్తురాగానే చేతుల్లో సర్పం పట్టుకున్నట్టు, అది గమనించి భయపడి వదిలేసినట్లు వదిలేశాను.

"ఒకవేళ నేను చచ్చిపోతే ఆఖరిక్షణంలో తననే తల్చుకున్నానని నా భార్యకి తెలియజేస్తావా? వాగ్దానం చెయ్యి." భగవాన్ ! ఈ పూళ్ళో ఇన్ని హాస్పిటల్స్ వుండగా ఈ నర్సింగ్ హోమ్‌కే ఎందుకు రావాలి? ఈరాత్రిడ్యూటీ పద్మకిగానిమరొకరికిగానిపడకుండా నాకేఎందుకుపడాలి? నేనక్కడ కూర్చోలేకపోయాను. అతన్ని ఎంతరోగిగా చూడాలనుకున్నా నా శక్తి చాలటంలేదు. వృత్తి ధర్మాన్ని మరేదో బాధవచ్చి జయించింది. అందుకే బయటికి వచ్చేశాను.

వెన్నెలరాత్రులు కాకపోవటంవల్ల బైటంతా చీకటిగా వుంది. ప్రకృతే అలిసిపోయి ఆదమరచి నిద్రపోతుందా అన్పించేట్టు నన్ను ఆ సమయంలో ఆ నిశ్శబ్దంలోంచి దూరంగా చర్చిలో 12 గంటలు కొట్టడం విన్పించింది. ఏనాడో తెగిపోయిన బంధానికి ఎందుకీ బాధ? ఎందుకీ ఆక్రోశం? తిరిగి తీసుకోలేని గతంకోసం ఆవేదనపడటం ఎంత మూర్ఖత్వం. అతనికి మరో పెళ్ళి అయింది. పిల్లలున్నారు. ఈ ప్రపంచంలో శైలజ అనే ఓ నిర్భాగ్యురాలు ఉందని అతనికి గుర్తుకూడా లేదు. అతను ఆనందంగానే వున్నాడు. జీవితం అన్ని విధాలా అతనికి సంతృప్తికరంగా గడుస్తున్నట్టే వుంది. మరి అలాటప్పుడు నాకెందుకు ఈ శిక్ష? నేనేం పాపం చేశాను?

వరండాలో స్తంభానికి చేరగిలబడి బైట చీకట్లోకి రెప్పవాల్చకుండా చూస్తున్న నా కళ్ళముందు గతం తిరగసాగింది.

నేను పేదకుటుంబంలో పుట్టినమాట వాస్తవమే. కాని అభిమానానికి నా కేనాడూ కొరతలేకపోయింది. ఆత్మీయత అనే సంపద నాకిప్పుడు పుష్కలంగానే లభించింది. అమ్మ, అన్నయ్య నన్ను అపురూపంగా పెంచి ఈ ప్రపంచంలో నాకూ ఓ ప్రత్యేకత వుంది అనే భావం నాలో ఏర్పరిచారు. ఉన్నదాంట్లోనే సంతృప్తిగా ఒడిదుడుకనేది ఎరుగకుండా 16 సంవత్సరాలు గడిపాను. అన్నయ్య కాలేజి చదువుకి పట్నం వెళ్ళాడు. ఇంటివద్దనుంచి సకాలానికి జీతానికీ, తిండికి డబ్బు పంపలేకపోయేవాళ్ళం. అయినా అన్నయ్య చదువు ఎక్కడా ఆగలేదు. ఏం తిన్నాడో, ఎక్కడుండేవాడో ఆ భగవంతుడికే తెలుసు. ప్రతిసారీ శలవులకి వచ్చినప్పుడల్లా హుషారుగా, కావలసినన్ని కబుర్లతో అమ్మకీ, నాకు చిన్నచిన్న ప్రెజెంటేషన్స్‌తో వచ్చేవాడు.

ఆఖరి సంవత్సరం. ఆసంవత్సరం గడిస్తే అందరం గట్టెక్కుతాం! అన్నయ్యకి డిగ్రీ వస్తుంది. మాదరిద్రం తీరుతుంది. ఆఖరిసారి కట్టాల్సిన పరీక్షకి అమ్మ ఒంటిమీద బంగారం మిగిలిందికాస్తా అయిపోయింది. ఎప్పుడెప్పుడు పరీక్షలయి పోతాయా అని అమ్మా, నేనూ రోజులు లెక్కపెట్టుకుంటూ కాలం గడుపుతున్నాం. కానీ పరీక్షలకి ముందే అన్నయ్య

యింటికి వచ్చేశాడు. ఊరికే రాలేదు! వెంట మహమ్మారిలాటి జ్వరాన్ని వెంటపెట్టుకుని వచ్చాడు.

"అమ్మా! నీ చల్లని స్పర్శ తగిలి త్వరగా నయం అవుతుందని మూర్ఖంచేసి వచ్చేశాను. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి." అప్పటికే బల హీనమైన అన్నయ్య పెదవులమీద శుష్కహాసం మెరిసింది.

రోజులు గడుస్తున్నాయి, పరీక్షలు దగ్గరపడుతున్నాయి. కానీ జ్వరం తగ్గటంలేదు. అమ్మా, నేనూ చేయవలసినదంతా చేస్తున్నాం. మావూళ్ళో అందరికీ మందిచ్చే ఆచార్యులుగారు ఏవేవో శ్లోకాలు చదివి, పిత్తం పైత్యం అంటూ నల్లటి మాత్రలు, రసాలు అన్నయ్యచేత మింగి స్తూనే వున్నాడు అయినా జ్వరం జారటంలేదు. పరీక్షలమాట దేవు డెరుగు. అన్నయ్య కోలుకుంటే చాలని అమ్మ భగవంతుడికి ముడుపులు కట్టటం ప్రారంభించింది.

అన్నయ్య ఓరోజు ఓపిక తెచ్చుకుని లేచి కూర్చుని నాచేత పట్నంలో వున్న తన మిత్రుడు సారథి అనే అతనికి ఉత్తరం వ్రాయిం చాడు.

"నీ పిచ్చిగాని, పరీక్షల ముందు అతను వస్తాడా అన్నయ్యా?" అన్నాను నేను.

"వస్తాడు" అన్నాడు దృఢంగా.

నాలుగైదు రోజులు గడిచినాయి. అన్నయ్య క్షీణించి శల్యంలా తయారై మంచానికి అంటుకుపోయాడు. చాలాసేపు పిలిస్తేగాని పలకటం లేదు.

ఆ రోజు సాయంత్రం నేను చెరువునుంచి మంచినీళ్ళబిందె చంకన పెట్టుకుని యింటికి వచ్చేసరికి అన్నయ్య మంచంమీద తెల్లగా, సన్నగా, పట్నవాసపు నాజూకుతనం అంతా మూర్తీభవించినట్టున్న ఒకతను కూర్చుని వున్నాడు. అన్నయ్య ఓపిక చేసుకుని లేచి కూర్చుని మాట్లాడు తున్నాడు. నన్ను చూడగానే అన్నయ్య "శైల" అన్నాడు. అతను "తెలుసుకున్నాను" అన్నట్టు నావైపుచూసి నవ్వాడు. నేను చప్పున లోప లికి వెళ్ళిపోయాను. ఆ తొందరలో నా చేతుల్లో ఉన్న కలువపూవుల్లో ఎర్రకలువ ఒకటి జారిపడిందని నాకు తెలియదు.

"అతనే సారధి! పాపం, రోడ్డుదగ్గర దిగి ఎనిమిదిమైళ్ళూ నడిచి వచ్చాట్ట" కాఫీ కలుపుతూ అంది అమ్మ.

ఇత్తడిగ్లాసు ఒకటి బలంగా రెండుసార్లు తోమి తెల్లగా మెరుస్తోంది అన్న నమ్మకం కుదిరిన తర్వాత తెచ్చి అమ్మకిచ్చాను. అమ్మ అందులో కాఫీపోసి "తీసుకెళ్ళి యివ్వు" అంది.

నేను కాఫీగ్లాసు తెచ్చేసరికి అతను చేతుల్లో ఎర్రకలువని పట్టుకుని దాని రేకులు సరిచేస్తూ అన్నయ్యతో "భయపడకు వాసూ, నేను వచ్చానుగా ఫర్వాలేదు. నీకిక్కడ వైద్యసహాయం లేదు. రేపే పట్నం తీసుకు వెడ్తాను" అంటున్నాడు. అతన్ని చూసినతర్వాత నాకు ధైర్యం వచ్చింది. అన్నయ్యకి ఫర్వాలేదు అనే నమ్మకం కుదిరింది. అమ్మ కూడా అలాగే అంది.

నే నిచ్చిన కాఫీగ్లాసు అందుకుంటూ అతను నావైపు చూసిన చూపు చిత్రంగా వుంది. నా కెందుకో సిగ్గేసింది.

"నీకు పువ్వులంటే యిష్టమా?" జేబురుమాలు తీసి గ్లాసు కాలకుండా పట్టుకుంటూ అన్నాడు.

అవునన్నట్టు తలూపాను.

తర్వాత ఎంతో కాలంనుంచి పరిచయం వున్నవాడిలా అన్నయ్యమందు సంగతి, ఇంటి సంగతులు యింకా ఎన్నెన్నో అడిగాడు. నాకు కూడా సంకోచం అన్పించలేదు. చనువుగానే జవాబు చెప్పాను.

మర్నాడు అతను ప్రయాణానికి సిద్ధం అవుతుంటే, ఇరుగు పొరుగువాళ్ళు తిథి, వారం బాగా లేదంటూ ఆపేశారు. ఆ మర్నాడు సాయంత్రం బైలుదేరటానికి ప్రయాణసన్నాహం జరిగింది. కానీ తెల్లవారనే లేదు. ఆ రాత్రి అన్నయ్య పరిస్థితి విషమించింది. ఆచారు వచ్చి నాడిచూసి పెదవి విరిచేశాడు. అమ్మ గొల్లుమంటూ అన్నయ్య మీదపడి ఏడవటం ప్రారంభించింది. నాక్కూడా యేడుపు ఆగలేదు. మేం అలా వాడిమీదపడి యేడుసుండగానే అన్నయ్యకి వెక్కిళ్ళు తగ్గినాయి అనుకున్నాను. కానీ నాకేం తెలుసు అది ప్రాణం పోవటం అని!

నేను చూసుండగానే అన్నయ్య ప్రాణాలు వదిలాడు. కాని ఇదెలా సాధ్యం! అన్నయ్యా, నేనూ ఒక ప్రాణంగా మెలిగాం. కలిసి జీవించాం.

అన్నయ్య చచ్చిపోయి, నేను జీవించటం ఎలా జరిగింది? అమ్మ హృదయ విదారకంగా యేడుస్తోంది. నాలో సజీవమయిన శక్తి యేదో మంచు తాకినట్టు మొద్దుబారిపోయింది.

ఏడుపు రాలేదు నాకు. అలాగే బిగుసుకుపోయినట్టు చూస్తూండి పోయాను.

ఎవరో "శైలూ - శైలూ!" అని పిలిచారు. భుజాలుపట్టి కుదిపారు. తిరిగి చూశాను. "శైలూ!" సారధి నన్ను ఒళ్ళోకి లాక్కుని బావురు మన్నాడు.

అన్నయ్య దహన సంస్కారాలకి కావలసిన ఏర్పాట్లన్నీ అతనే స్వయంగా చూశాడు. తన చేతులమీదనుంచే ఆ కర్మకాండలన్నీ ముగించాడు. పదిహేను రోజులు యిట్టే జరిగిపోయాయి. అతని పరీక్షలు నాలుగు రోజుల్లోకి వచ్చాయి. వెళ్ళక తప్పలేదు.

వెళ్ళిపోయేముందు తన పేరుతో అడ్రస్‌లు వ్రాసి కవర్లు కొన్ని నా చేతికిస్తూ "శైలూ! నాలుగు రోజుల కొకసారి అమ్మా, నువ్వూ ఎలా గుందీ నాకు ఉత్తరం వ్రాస్తావు కదూ?" అన్నాడు. అలాగేనని తలూపాను. ఇంకో కవరు అందిస్తూ, "ఇదిగో యిందులో డబ్బుంది. వాడుకో, ఇంకా అవసరం అయితే నాకు ఉత్తరం వ్రాయి. నేను పరీక్షలు అయి పోగానే మళ్ళీ వస్తాను" అన్నాడు.

ఆ నాలుగు రోజుల్లోనే ఊళ్ళోవాళ్ళంతా యేదయినా సంబంధం చూసి నాకా మూడుముళ్ళు వేయించి పుణ్యం కట్టుకోమని సలహా ఇచ్చారు. అతనెందుకో దానినంత పట్టించుకున్నట్టు లేదు.

అతను వెళ్ళిపోయేరోజు వచ్చింది. అమ్మ లోపల గదిలో వెక్కి వెక్కి ఏడుస్తోంది. నేను వీడ్కోలు యిచ్చాను.

"డబ్బుకి యిబ్బంది పడొద్దు" అన్నాడతను మరోసారి గుర్తు చేస్తూ.

"ఇది చాలు" అన్నాను.

"శలవు లివ్వగానే సరాసరి యిక్కడికే వస్తాను! అప్పుడేం చెయ్యాల్సిందీ చెప్తాను-సరేనా?"

అంగీకారం సూచిస్తూ తలపూపాను.

"అమ్మ జాగ్రత్త" అదీ ఆఖరిమాట!

సారథి వెళ్ళిపోయాడు. రోజులు గడుస్తున్నాయి! అమ్మ పూర్తిగా మంచం ఎక్కి దిగటం మానేసింది. ఇంట్లో పనంతా చాతయినట్టు నేనే చూస్తున్నాను. నా జీవితం హాస్యమైపోయింది! చక్కగా విన్పిస్తున్న గానం ఒక్కసారి ఆగిపోతే ఎలాటినిశ్శబ్దతఏర్పడుతుందోనాకలా వుంది జీవితం. సారథి ఇచ్చిన డబ్బుతో ఆర్థికంగా ఇబ్బంది లేకుండా గడిచి పోతోంది. నేను చాలా జాగ్రత్తగా పొదుపుగా వాడుతున్నానుకూడా.

వూళ్ళో మా శ్రేయోభిలాషులు కొందరు ఒక సంబంధం తీసు కొచ్చారు. మా వూరికి పదిమైళ్ళ దూరంలో వున్న ఓ పెద్ద పల్లెటూరికి అతను మునసబు చేస్తున్నాడు. మొదటిభార్య ఈ మధ్యనే ప్రసవించలేక చనిపోయి ఆర్నెల్లయిందట. నలుగురు పిల్లలున్నారు. పొలం బాగానే వుంది. పాడీపంటా సమృద్ధిగా వున్న కుటుంబం. అమ్మకి సంబంధం నచ్చింది. అతను నేను ఒప్పుకుంటే కట్నం అవీ యేమీ అవసరంలేదని, రెండువైపులా పెళ్ళి ఖర్చు తనే భరిస్తాననీ కబురు చేశాడు.

అమ్మ పోరుమీద నేనీ సంగతి సారథికి వుత్తరం వ్రాయక తప్ప లేదు. అమ్మ వ్రాసినట్టు వ్రాశాను.

తిరుగు టపాలో వెంటనే జవాబు వచ్చింది. అందులో ఇలావుంది: "శైలూ! నీకేమయినా మతిపోయిందా? పిచ్చిపిచ్చి ఆలోచనలు మానెయ్యి. నాలుగయిదు రోజుల్లో పరీక్షలు అయిపోతాయి. నేను వస్తాను."

ఆ ఉత్తరం చూసిం తర్వాత నా గుండెలమీంచి పెద్దబరువు దించి నట్టయింది. అమ్మకి చదివి వినిపిస్తే ముఖం మాడ్చుకుని "ఈయన వచ్చి చేసేదేమిటి? బంగారంలాంటి సంబంధం, చేయిదాటిపోతే" అంది. వారం రోజులు గడువు ఇమ్మని మునసబుగారికి కబురుచేసింది.

సారథి అన్నట్టుగానే వచ్చాడు. ఆ సాయంత్రం నాకు బాగా గుర్తుంది.

అమ్మ దగ్గర కూర్చుని "శైలజని నేను చేసుకుంటాను" అన్నాడు.

లాంతరు గ్లాసులు తుడుస్తున్న నాచేతులు క్షణంసేపు ఈమాటలు వినగానే వణికాయి. నా చెవులనే నే నమ్మలేకపోయాను. గాఢాంధ

కారంలో యెక్కడో మినుకుమినుకు మంటున్న చిన్న వెలుగు కిరణం అంతఅయి ఇంతఅయి అన్నట్టు హఠాత్తుగా ఒక్కసారి పెరిగి నా మన సంతా ఆవరించుకుంది. అక్కడే అలాగే శిలాప్రతిమలా కూర్చుండి పోయాను.

"కాని ఒక్కటి. నేనిక్కడే నిరాడంబరంగా చేసుకుంటాను" అన్నాడు.

అమ్మ దీనికి ఒప్పుకోలేదు. వాళ్ళమ్మకి చెప్పి ఆవిడ అనుమతి పొందాలని గట్టిపట్టు పట్టింది. అమ్మ చాదస్తానికి నాకు విసుగేసింది. అవన్నీ అతడు ఆలోచించుకోలేడా? మనం చెప్పాలా?

సారధి సరేనని వెళ్ళాడు. నాలుగైదు రోజుల తర్వాత ఉత్తరం వచ్చింది. అందులో తల్లి ఒప్పుకుందని, ముహూర్తం కూడా నిర్ణయించు కున్నామనీ వ్రాశాడు.

శుభలేఖలు కూడా స్వయంగా ప్రింట్ చేయించి పంపాడు. అది చూసిన తర్వాత అమ్మ సంతృప్తిగా నిట్టూర్చింది. నన్ను దగ్గరకు లాక్కుని "శైలూ! నీ జాతకం యింత గొప్పదంటే నేనే నమ్మలేకపో తున్నాను" అంది.

సారధి నాకు భర్త కాబోతున్నాడని తెలుసుకున్న వెంటనే అందరూ వచ్చి నా అదృష్టాన్ని గురించి పొగిడి వెళ్ళారు.

పెళ్ళికి ఎక్కువమంది రాలేదు. వివాహం సారధి కోరినట్టే చాలా నిరాడంబరంగా జరిగిపోయింది. సారధి ముడివేసిన ఆ మాంగల్యాన్ని చేత్తో పదేపదే తడిమి చూసుకున్నాను నేను. నాఅదృష్టానికి నాకే భయం వేసింది. సారధి నా భర్తా? నిజంగా నేనతని భార్యనేనా? హఠాత్తుగా, ఉజ్జ్వలంగా భాసించిన ఈ కాంతితో నాకళ్ళు వాస్తవాన్ని గ్రహించలేనట్టు గుడ్డిపైనాయి.

మూడు నిద్రలకి సారధి ఊరు వెళ్ళాము. నా కింకెవరూ లేకపోవ డంవల్ల నేను ఒక్కదాన్ని రావల్సివచ్చింది అక్కడ సారధి యిల్లూ, ఆ వాతావరణం, ఆ మనుష్యులు, ఆ వేషభాషలు చూసి దిమ్మెర పోయాను. సారధి తల్లి నన్ను ఆప్యాయంగా అదరించనూ లేదు. నిర్ల క్ష్యంగా తిరస్కరించనూలేదు. అంటీ ముట్టనట్టుగా వుండిపోయింది.

రెండు రోజులు గడిచిపోయినాయి. మూడోరోజు సాయంత్రం యింటికి దక్షిణంగావున్న పూలమొక్కలవైపు వెళ్ళాను. అక్కడ రకరకాల పూల మొక్కలున్నాయి. గుబురుగా పెరిగిన మామిడిచెట్లు కూడా వున్నాయి. మనుష్యులు కూర్చునేందుకు వీలుగా అక్కడక్కడా రాతి బెంచీలు వున్నాయి.

ఇంకో రెండురోజుల్లోనే నేనిక్కడ నుంచి వెళ్ళిపోతాను. నేను పుట్టి పెరిగిన వాతావరణానికి, యీ వాతావరణానికి ఎంత వ్యత్యాసం! ఎలాంటి యిబ్బందులు లేకుండా నే నిక్కడి వాళ్ళలో కలిసిపోగలనా? అలా కలిసిపోయేందుకు సారథి నాతో సహకరిస్తాడా? అర్థంలేని యీ ప్రశ్నలతో పరధ్యాసగా కూర్చుండిపోయిన నేను అడుగులచప్పుడువిన్పించినట్టయి వెనక్కు తిరిగి చూడబోయాను. కాని యింతలో రెండు బలమైన చేతులువచ్చి నా కళ్ళు మూసేశాయి. చేతులు తడిమి చూశాను. మగవాళ్ళ చేతులు. కుడిచేతికి రాయిలేని ఎనామిల్ ఉంగరం వుంది. ఒంటరిగా కూర్చున్న నా కళ్ళు మూసేంతటి ధైర్యం, సాహసం, ఆ చిలిపికోరిక యింకెవరికి వుంటుంది! ఆ స్పర్శ ఎవరిదో గ్రహించుకున్న నాకు శరీరం అంతా విద్యుత్ ప్రవహించినట్టయింది.

"ఎవరో చెప్పు!" కొద్దిగా గరుకుగా వున్న చెంప నా నునుపైన చెంపకి ఆనింది.

"మీరే!" అక్కడెవరూ లేకపోయినా రహస్యంగా జవాబు యిచ్చాను.

"దొంగ! గుర్తు పట్టేశావే!" అంటూ నవ్వుతూ భుజాలు పట్టుకుని తనవైపు తిప్పుకున్నాడు.

"శైలూ!—" ఏదో చెప్పబోయిన అతను హఠాత్తుగా ఆగిపోయి, నావైపు చూస్తుండిపోయాడు. నిశ్చలంగా నావైపు రెప్పవాల్చకుండా సూటిగా చూస్తున్న ఆ చూపులో నాపట్ల కోర్కె అనురాగం, ఆప్యాయత అన్నీ నిండుగా తొణికిసలాడుతున్నాయి.

"ఏమిటి?"

"ఏదో చెప్పాలనుకున్నాను. కాని గుర్తురావటంలేదు" అంటూనే చాలా మెల్లగా నన్ను దగ్గరకు లాక్కుని గుండెలకి హత్తుకున్నాడు. సృష్టి

ఆగిపోయింది. ప్రపంచం అంతా మృదుమధురమయిన గానంతో నిండి పోయింది. అతని చేతుల్లో పసిపిల్లలా ఒదిగిపోయాను నేను. ఆ సమయం చాలా క్షణికమే కావచ్చు. కాని అదే నాకు శాశ్వతం అయింది. ఆరోజు ఆ పరిష్వంగంలోని ఆ మధురిమను నేను చవిచూడక పోయినట్టయితే యిన్ని సంవత్సరాలు నేను ఒంటరిగా మరో పురుషుని స్పర్శ యెరుగకుండా వుండేందుకు నిగ్రహం వచ్చేదికాదేమో! బ్రహ్మచారిణిగా ఇన్ని సంవత్సరాలు నిష్కళంకంగా గడపటానికి నాకు శక్తి చాలేదికాదేమో! "శైలూ!—"అది పిలుపుకాదు. నాలాటి అనుభూతినే తను కూడా పొందుతూ అదేదో చెప్పలేక ఆరాటపడుతున్న హృదయం యొక్క ఆలాపన.

ఇంతలో దూరంగా "అబ్బాయీ!" అన్న మా అత్తగారి పిలుపు విన్పించింది. సారథి నన్ను వదిలేశాడు. నేను మెరుపుతీగెలా ఇంట్లోకి పరుగెత్తాను.

లోపలికి వెళ్లేసరికి ఇల్లంతా హడావుడిగా వుంది. మా అత్తగారు, పిన్నత్తగారు సందడిగా మాట్లాడుకుంటున్నారు. నన్ను చూడగానే మా అత్తగారు "అమ్మాయీ, చప్పున హాల్లోకి పద, రామానందతీర్థులుగారు వచ్చారు. అబ్బాయి ఎక్కడున్నాడో" అంది.

నాకు తర్వాత తెలిసింది. రామానందతీర్థులుగారు మా అత్తగారికి గురువుగారు. ఆయన ఆశీర్వచనంవల్లనే చాలా కాలానికి లేకలేక సారథి కలిగాడు. ఇంట్లో ఏది జరిగినా, ఆయన ఆశీర్వచనం అందుకుని పని ప్రారంభించటం ఆ యింటి ఆచారం. పెళ్ళికి ముందు ఆయన బదిరీనాథ్‌లో వుండటంవల్ల, సారథి ఒకటే తొందరపడటంవల్ల అది వీలు కాలేదు.

నేను ఆవిడ చెప్పినట్టు వెళ్ళి బుద్ధిమంతురాలులాగా ఆయన దగ్గర కూర్చున్నాను. కొద్దిసేపయింతర్వాత సారథి కూడా లోపలికి వచ్చాడు. ఇద్దరం ఆయన పాదాలకి నమస్కరించాం. ఆయన మమ్మల్ని ఆశీర్వదించి కూర్చోమన్నారు.

"త్వరగా మనుమడు కలిగేలా నన్ను ఆశీర్వదించండి" అంది మా అత్తగారు.

ఆయన నవ్వి "ఏదమ్మా చెయ్యి" అంటూ నా చేతిని తీసుకుని చూడడం ప్రారంభించారు. చూస్తుండగానే ఆయన కనుబొమ్మలు ముడి పడ్డాయి. క్షణంసేపు తలెత్తి నావైపు తీక్షణంగా చూశారు. నేనా చూపులకి బెదిరి పోయానని వేరే చెప్పనవసరంలేదు.

"నువ్వు లోపలికి వెళ్ళమ్మా" అన్నారు మళ్ళీ ప్రసన్నంగా. నేను లేచి లోపలికి వెళ్ళిపోయేముందు మళ్ళీ నమస్కరించాను. చిరకాలం జీవించమని నన్ను చేయెత్తి ఆశీర్వదించారు.

ఆ రాత్రి గడిచిపోయింది. మర్నాడు పగలంతా గడిచిపోయింది. తీర్థులుగారు ఆ సాయంత్రం వెళ్ళిపోయారు. అంతా ఆడంబరంగా వీడ్కోలు యిచ్చారు.

లోపలి గదిలో వంటరిగా నిలబడివున్న నా దగ్గరికి సారథి వచ్చి "శైలూ!" అన్నాడు. "మంచినీళ్ళు కావాలి" అన్నాడు. నేను వెళ్ళి మంచి నీళ్ళు తెచ్చి యిచ్చాను. గ్లాసు అందుకుంటూ "రాత్రి అంతా నిద్రపోయిం తర్వాత నిన్నటిచోటికి రా" అన్నాడు. అది అభ్యర్థన కాదు. ఆదేశం అంతకంటే కాదు. ఆజ్ఞాపించినట్టుంది.

నాకు భయంకంటే సిగ్గెక్కువగా కన్పించింది. అతను నా భర్తే కావచ్చు. అయినాసరే - అలా దొంగతనంగా అందరూ నిద్రపోయిం తర్వాత వెళ్ళాలంటే—తప్పదు. సారధి కోర్కెని కాదనే సాహసం నాకు లేదు.

ఎలాగో ధైర్యం తెచ్చుకుని వెళ్ళాను. నేను వెళ్ళేసరికి అతడక్కడ కూర్చుని ఉన్నాడు. ఆ రాత్రి, అందులో నిశ్శబ్దం, ఆ వెన్నెల, అందులో తెల్లటిబట్టల్లో కూర్చుని నా కోసం యెదురుచూస్తున్న అతన్ని చూసేసరికి నా భయం మంచులా కరిగిపోయి సందేహం పటాపంచలయింది. మనసు, శరీరం రెండూ తీయని వలపుతో మత్తెక్కినాయి. నా అడుగుల చప్పుడు అంత దగ్గరగా విని కూడా అతను తిరిగి చూడలేదు. నేనేం చేస్తానో చూడాలని కూర్చున్నాడేమో? నిన్న అతను చేసిన పనే నన్నీరోజు రెచ్చగొట్టింది. వెనకగా వెళ్ళి కళ్ళు మూశాను. అతను ఉలిక్కిపడటం చూసి తెలబోయాను.

"శైలూ!" అన్నాడు చేతులు తడుముతూ.

"భయపడ్డారా?"

"కాదు, ఇలావచ్చి కూర్చో." అతని ముఖం, ఆ మాట్లాడే తీరు ఎలాగో వుంది. క్షణం సేపు అతిచనువుగా ప్రవర్తించానేమో అన్న అనుమానం నన్ను సిగ్గుపడేలా చేసింది.

ప్రక్కనవచ్చి కూర్చున్నాను. అతనేం మాట్లాడలేదు.

"ఏమిటి?" అన్నాను.

"నీకో విషయం చెప్పాలని పిల్చాను."

చెప్పమన్నట్టు చూశాను.

అతను కిందికిచూస్తూ అన్నాడు. "శైలూ! నేను ఎం. ఏ. చదవాలనుకుంటున్నాను. నిన్నిప్పుడే తీసుకురావటానికి వీలుపడదేమో!" నాకు నవ్వు వచ్చింది. దానికింత వుపోద్ఘాతం. ఇంత గంభీరం దేనికో! కోపం వచ్చింది కూడా. ఆ మాట చెప్పటానికి లోకం మునిగిపోయినట్టు కూర్చోవాలా ఏమిటి? నవ్వుతూ సరదాగా చెప్పగూడదా!

"అది చెప్పటానికే పిలిచాను."

ఏం మాట్లాడాలో నాకు నాకు తోచలేదు. నాకు సందేహం వేసింది. "మీరప్పుడప్పుడు వస్తుంటారుగా!" అన్నాను. వెంటనే సమాధానంరాలేదు. తలతిప్పి అతనివైపు చూశాను. అప్పటికే నన్ను పరిశీలనగా చూస్తున్న అతను "ఆ" అన్నాడు. మళ్ళీ నిశ్శబ్దం. అంతా మత్తెక్కించే వెన్నెల, చక్కటి నిశ్శబ్దం. కొద్దిసేపయింతర్వాత "ఇక వెళ్ళనా?" అన్నాను.

"ఊఁ!"

నా కెందుకో కోపం వచ్చింది. తీరని అనుమానం కూడా అన్పించింది. నిన్నటి మనిషేనా యితను? ఉన్నట్టుండి యిలా యెందుకయాడు! తల్లి కొడుకుల మధ్య నా గురించి యేమైనా అభిప్రాయ భేదం రాలేదు కదా! కనీసం ఆప్యాయంగానైనా మాట్లాడడే! దెబ్బతిన్న మనసుతో చివ్వున లేచి వచ్చేయబోతుండగా అతను చటుక్కున చేయి పట్టుకుని ఆపాడు. తిరిగి చూశాను.

"శైలూ? ఎప్పుడయినా నీ క్షేదయినా నా ద్వారా తీరని బాధ కలిగితే యేం చేస్తావు?"

"చెవులుపిండి ఎందుకలా చేశారని అడుగుతాను" అనాలనుకున్నా. కాని మనస్సులోని మాట పైకిరాలేదు. నిశ్శబ్దంగా నిలబడిపోయాను.

"రేపు ఉదయం నేను ఫ్రండ్స్‌తో కలిసి ఢిల్లీ, ఆపీ చూడడానికి వెడ్తున్నాను. బహుశా కాశ్మీర్ కూడా వెళ్ళొచ్చు. రెండు నెలల వరకూ తిరిగిరాను."

రెండు నెలలే! నేను ఆగిపోయాను. అంటే అన్ని రోజుల వరకూ అతన్ని చూడలేను. అప్పటివరకూ యిదే ఆఖరి చూపా?

"ఉత్తరం వ్రాస్తుంటారుగా!" అడగలేక అడిగాను.

"చెప్పలేను. ఊళ్ళు తిరుగుతుంటే అడ్రస్ ఒకటి వుండదు."

"వ్రాయడానికేం?"

"అలాగే! తప్పకుండా వ్రాస్తాను." నా చెయ్యి నెప్పి పుట్టేంత గట్టిగా నలిపి వదిలేశాడు.

నేను వెళ్ళటానికి రెండడుగులు వేయగానే అతను నిట్టూర్పు విడవటం విన్పించింది. వెనక్కు తిరిగాను.

"ఏం లేదు, వెళ్ళు."

నాకు ఏడుపొచ్చినంత పనయింది. ఎలా వచ్చాను? ఏ విధంగా తిరిగి వెడ్తున్నాను? కన్నీళ్ళు దాచుకునే ప్రయత్నంకోసం నడకవేగం హెచ్చించి గబగబా వచ్చేశాను.

మా వూరు వచ్చేశాను. 15 రోజులతర్వాత సారథి దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. కొట్టుకునే గుండెలతో, వణుకుతున్న చేతులతో కవరు చించాను. సారథి స్పర్శ తెచ్చిన ఆ ఉత్తరం ముట్టుకుంటే అతన్ని తాకినట్టే వుంది. పరిచితమైన ఆ దస్తూరి చూడగానే నా మనసు పురివిప్పిన నెమలిలా నాట్యం ప్రారంభించింది.

కాని....కాని.... ఆ వుత్తరం చదువుతుంటే నా ప్రాణాలు ఎగిరిపోసాగిగాయి.

నేను వూహించినట్లులేదు ఆ వుత్తరం. అందులో యిలా వుంది:

"శైలూ!

నువ్వు క్షేమంగా వున్నావని తలుస్తాను. నేను కులాసాగానే వున్నాను. నీకో ముఖ్య విషయం చెప్పబోతున్నాను. నాకు తెలుసు నే

నెంత బాధపెట్టబోతున్నానో. కాని అంతకి వేయిరెట్లు ఎక్కువగా నేను బాధపడి గత్యంతరం లేక నీకీ వుత్తరం వ్రాస్తున్నాననే సంగతి మర్చిపోకు. శైలూ! ఆ రోజు రామానంద తీర్థులుగారు నీ చేయి చూశారు గుర్తుందా? నిన్ను లోపలికి వెళ్ళిపొమ్మన్న తర్వాత ఆయన అమ్మవైపు తిరిగి అబ్బాయితో కలిసి కాపురం చేయటానికి వీల్లేదు అన్నారు.

అమ్మ వులిక్కిపడింది. నేను తెల్లబోయి చూడసాగాను.

ఆ అమ్మాయి చేతిలో పురుష సంపర్కయోగంలేదు! యావత్ జీవితం కన్యగా వుండే జాతకం ఆమెది అంటే తెలిసిందా?

అమ్మ నావైపు చూసింది. పిడుగుపాటు పొందిన మనిషిలా బిగుసుకు పోయాను నేను.

"సాధ్యమయినంత త్వరలో ఆ అమ్మాయిని వదిలేసి అబ్బాయికి పెళ్ళి చేయటం మంచిది" అన్నారాయన. అంతకంటే ఆ ప్రసంగం పెంచలేదు. కాని అమ్మకీ మాటలు చాలు. మొదటినుంచీ తీర్థులుగారి మాట ఆ యింట్లో వేదవాక్కుగా పరిగణింపబడ్తోంది. నాకు జాతకాలమీద నమ్మకంలేదు కాని ఆయనమాట శిలాశాసనం. అమ్మకి నేను యేకైక సంతానం. ఎన్నడూలేంది నాకు రామానందతీర్థులుగారి మాటల మీద విసుగు జనించింది. నేను కాకుండా అమ్మకి యింకో సంతానం వుంటే యెంత బాగుండేది అని మొట్టమొదటి సారిగా అన్పించిన క్షణాలివి. కానీ నేనేం చెయ్యను? నా అభిప్రాయాలతో వాళ్ళకి పనిలేదు శైలూ! అర్థమయిందా? కనీసం అమ్మ బ్రతుకున్నంతకాలమయినా నేను నిన్ను పొందలేను, నన్నర్థంచేసుకో. ఇంతకంటే వ్రాయలేను. నేను నిన్ను కావాలని కోరి పట్టుబట్టి పెళ్ళి చేసుకున్నాననే సంగతి మర్చిపోకు శైలూ! నీ జీవితం ఎలా గడుస్తుందనే బెంగ నీకు అవసరంలేదు. కాలక్షేపం లేదు అనుకుంటే చదువుకో, డబ్బుపంపిస్తా. నిన్ను అప్పుడప్పుడు చూడటం కూడా నాకు వీలుపడదు. నిన్ను చూస్తే నా నిగ్రహం యెంతవరకో నేను చెప్పలేను. అందుకే చూడదల్చుకోవటంలేదు. చూడనని అమ్మకి భగవంతుని సాక్షిగా వాగ్దానం చేశాను. తర్వాత-అసలు విషయం చెప్పడం మర్చిపోయాను. ఎప్పుడయినా నా తరఫునుంచి ఎవరయినా వచ్చి నిన్ను కాగితాలమీద సంతకం పెట్టమంటే పెట్టకు. నేను

నిన్ను శారీరకంగా పొందలేకపోయినా మానసికంగా పొందాను; నువ్వు నా దానివి, ఆ విషయం మర్చిపోకు. శైలూ! బాధపడకు. నువ్వు బాధ పడ్తే నిన్ను దగ్గరకు తీసుకుని ఓదార్చలేని నా అశక్తి నన్ను మంటల్లో పెట్టి కాలుస్తూంది. నా మనసుని ముక్కలు ముక్కలు చేసి నిర్దాక్షిణ్యంగా నన్ను హింసిస్తోంది. నే నప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాస్తుంటాను. నువ్వుకూడా జవాబు వ్రాయి."

నేను మామూలు మనిషిని కావటానికి చాలారోజులు పట్టింది. నా పరోక్షంలో రహస్యంగా ఆ ఉత్తరం చదివిన అమ్మ శోకాలు మొదలు పెట్టింది.

రెండు నెలల తర్వాత-సారథి మేనమామ వచ్చాడు. విషయం చెప్పి, విడాకులకోసం కాగితాలమీద సంతకం పెట్టమన్నాడు.

వీల్లేదని అమ్మ పోట్లాడింది; తిట్టింది. నానా శాపనార్థాలు పెట్టి ఏడ్చింది. నేను మౌనంగా కాగితాలు అందుకుని సంతకం పెట్టిఇచ్చాను. నా ద్వారా సారధికి అశుభం జరగటానికి వీల్లేదు. సారథి పేరుమీద తర్వాత ఉత్తరం వ్రాశాను. నిజంగా అతనికి రెండోపెళ్ళి చేసుకోవాలనే కోర్కె లేకపోతే నా సంతకాలు ఏం చేయలేవని చేలియజేశాను. ఒకవేళ ఏ కారణాల చేతనయినా పెళ్ళికి ఒప్పుకున్నా నేను బాధపడనని చెప్పాను. పెళ్ళి చేసుకున్నా నా మీద అతనికి అధికారంపోదు. "నీ మీద నాకు అధికారం వుండదేమో, కాని నా మీద నీకు జీవితాంతం వుంటుంది. ఉత్తరాలు వ్రాయడం మానవద్దని" కోరాను.

నేనువ్రాసిన ఉత్తరం అందిందోలేదో నాకు తెలియలేదు. తర్వాత అతనినుంచి నా కెటువంటి జవాబూ రాలేదు. ఏ సంగతి తెలియలేదు. మళ్ళీ నాకతను కన్పించలేదు, కనీసం నేనేమైపోయానో కూడా తెలుసుకోటానికి ప్రయత్నించలేదు.

భర్త వదిలేసిన స్త్రీకి మన సంఘంలో ఎలాంటి గౌరవం ఉంటుందో మీ అందరికీ తెలుసు. ఈ వూళ్ళో వుండడం దుర్భరం అయింది. అమ్మని తీసుకుని మా దూరపు బంధువైన గోపాలరావు గారింటికి వచ్చేశాను. సంతానంలేని ఆ దంపతులకు నారాక ఆనందాన్నే కదిలించడం నా అదృష్టం! అమ్మ ఎక్కువకాలం బ్రతకలేదు. చివరి

రోజులు నిశ్చింతగానే వెళ్ళాయని మాత్రం చెప్పగలను. బాబాయి నాకు వేరే పెళ్ళి చేస్తానన్నాడు. నేను ఇష్టపడలేదు. వేరే మనిషి స్పర్శ వూహ కూడా నాకు కంపరం కలిగించేది. సారథిని నా భర్తగా పొందలేని ఈ దౌర్భాగ్య జీవితానికి ఇంకో మనిషి అనవసరం అన్పించింది. బాబాయి సలహాని అనుసరించి నర్సింగ్ కోర్స్‌లో చేరాను. శిక్షణకాలం పూర్త యింది. బాబాయికి బాగా తెలిసిన ఈ నర్సింగ్ హోంలో నర్సుగా చేరి కూడా నాలుగు సంవత్సరాలు కావస్తోంది. నాకిక్కడే హాయిగా, ప్రశాం తంగా వుంది. నాతోటి నర్సు పద్మ నన్ను ప్రాణంగా చూస్తుంది. ఇద్ద రం కలిసి ఒకే యింట్లో వుంటున్నాం. మెల్లగా గతం గురించి మర్చి పోతున్న సమయంలో ఇన్ని సంవత్సరాలకు మళ్ళీ సారథి ఇలా కన్పించి, నాలో మానుతున్న పాత గాయాన్ని నిర్లక్ష్యంగా రేపాడు. అతని మాటల ద్వారానే పెళ్ళయిందనీ, ఇద్దరు పిల్లలనీ తెలుసుకున్నాను.

గదిలోపలనుంచి మూలుగు విన్పించటంతో ఉలిక్కిపడి పరు గెత్తాను. ఎంత మందమతిని! డాక్టర్ హెచ్చరిక మర్చిపోయి దాదాపు రెండు గంటలసేపు వరండాలో నిలబడ్డాను.

వరసగా మూడురాత్రిళ్ళు-మూడు పగళ్ళు ఆ జబ్బుతో హోరా హోరీ పోట్లాడి సారథిని బ్రతికించుకున్నాను నేను.

"ఇంకా ఎన్నాళ్ళిలా కూర్చుంటావు? ఇక ఫర్వాలేదని డాక్టరు గారు చెప్పారుగా-వెళ్ళు, నేను కూర్చుంటాను" పద్మ వచ్చి బలవంతం చేయటంతో తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోటానికి ఇంటికి వెళ్ళాను.

మూడు రోజులు తదేకంగా కూర్చోవటంవల్ల శారీరకంగా కలి గిన అలసటకంటే, విపరీతమైన ఆలోచనలతో బాధిస్తున్న అశాంతిని భరించలేకుండా వున్నాను. ఆ రోజంతా గడిచి పోయింది.

మర్నాడు సాయంత్రం పద్మ వచ్చి సారథి కులాసాగానే వున్నా డనీ మాట్లాడుతున్నాడనీ చెప్పింది. తృప్తితో నిట్టూర్పు విడిచాను. మళ్ళీ నర్స్‌గా అతనికెదురుగుండా వెళ్ళే ధైర్యం చాలేదు. ఒంట్లో బాగాలేదని వంకపెట్టి ఇంట్లోనే కూర్చున్నాను.

రెండురోజులు గడిచిం తర్వాత పద్మ ఇంటికివచ్చి డ్రెస్ మార్చు కుంటూ "అతను నిన్ను చూడాలంటున్నాడు" అంది.

"నన్నా?"

"అవును. 'నిన్ను బ్రతికించిన క్రెడిట్ మా నర్స్‌ది అన్నారుట డాక్టరు. అదిగాకుండా నీ ముఖం అతనికి గుర్తుందిట!"

నా గుండె లయ తప్పింది. "అందుకే నీకు స్వయంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలని ఆరాటపడుతున్నాడు" అంది పద్మ.

"అది నా డ్యూటీ అని చెప్పు" అన్నాను.

"ఏమో బాబూ! నాకు తెలియదు. నువ్వే చెప్పు."

"పద్మా! ఆ నర్సు నువ్వేనని చెప్పకూడదూ?"

"అంత తేలికగా మోసపోయే మనిషిలా లేడు" పద్మ నవ్వి బాత్‌రూమ్‌వైపు వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం పద్మకి ఆఫ్! ఎవరో ఫ్రెండ్‌తో సినిమాకు వెళ్ళింది. డాక్టర్ కబురు చేయటంవల్ల నేను తప్పనిసరిగా వెళ్ళాల్సి వచ్చింది.

డాక్టరు నన్ను చూడగానే "నీ వంట్లో ఎలా వుంది? 8 వ గదిలో పేషెంట్ నిన్ను చూడాలని తపిస్తున్నాడు. వెళ్ళు. వెళ్ళి ఒక్కసారి కన్పించిరా" అని వెళ్ళిపోయారు. డాక్టర్ మాటకి ఎదురు చెప్పే సాహసం నా కెక్కడిది?

"నర్స్! చిన్న పని చేసి పెట్టాలి."

"ఏమిటది?"

నా కంఠస్వరం వింటూనే అతను ఉలిక్కిపడ్డట్టు చూశాడు. నా ముఖం కొద్దిగా చీకట్లో వుండేట్టు జాగ్రత్త పడ్డాను. క్షణంసేపు నావైపు చూసిన అతను "నన్ను....నన్నంత జాగ్రత్తగా చూసి కంటికి రెప్పలా కాపాడింది నువ్వేనా?" అన్నాడు.

"ఇక్కడికి వచ్చిన ప్రతి రోగికి మా శాయశక్తులా సేవచేయటం మా ధర్మం. మీకు చేసిన దాంట్లో ప్రత్యేకత ఏంలేదు." నాకు తెలియకుండానే ఆ మాటలు వాడిగా వచ్చాయి.

అతను తెల్లబోయినట్టు చూశాడు.

"చెప్పండి. ఏంపని చేసి పెట్టాలి?"

"తెల్లకాగితం కావాలి. ఉత్తరం వ్రాసి పెట్టాలి."

"ఇప్పుడే తెస్తా" గదిలోంచి పారిపోయాను.

పదినిమిషాలు పోయింతర్వాత కాగితం, కలంతో తిరిగి వచ్చాను.

"కొద్దిగా వ్రాసి పెట్తావా? నేను వ్రాయలేను."

"అలాగే."

అతను కళ్ళు మూసుకుని వెనక్కు వాలి పడుకున్నాడు.

గదిలో లైటువేసి క్రీనీడలో వ్రాయటం ప్రారంభించాను.

"ప్రియమైన కమలకి!"

అతను చెప్పటం ప్రారంభించాడు.

ఆ మాట వ్రాయటం వ్రాశాను, కాని చేతులు వణకటం మాత్రం నిగ్రహించుకోలేకపోయాను.

అతనలా కళ్ళు మూసుకునే చెబుతున్నాడు.

"నేనిక్కడ కులాసాగానే వున్నాను. అనుకోకుండా కాస్త జ్వరం తగలటంవల్ల తప్పనిసరిగా నర్సింగ్ హోమ్‌లో చేరాల్సి వచ్చింది. బంగారు పడకు జ్వరం తగ్గిపోయింది. నాలుగైదు రోజుల్లో బైలుదేరి వస్తాను. బాబుకి పాపకి నా తీయతీయటి ముద్దులు."

ఎంత ప్రయత్నించినా నేను ఉత్తరం వ్రాయలేకపోయాను. నాకు శక్తి చాలలేదు. కాగితం కలంతీసి అక్కడ పారేసి బయటికి వచ్చేశాను. అతను అర్థంగానట్టు చూసి వుండవచ్చు. అందుకే వెనకనుంచి "నర్స్! అదేమిటి వెళ్ళిపోతావేం?" అన్న కేక విన్పించింది.

నేను మళ్ళీ ఆ గదిలోకి వెళ్ళలేదు; అతను పిలువలేదు. రాత్రి 12 గంటలకి మందు ఇచ్చి టెంపరేచర్ చూడాలి. మనసు కుదుట పరచుకున్న నేను దృఢంగా నిశ్చలంగా గదిలోకి వెళ్ళాను! అతను నిద్రపోతున్నాడు. ఉత్తరం నేను పెట్టినచోట అలాగే వుంది. క్షణంసేపు అతన్ని చూస్తూ అలాగే నిలబడిపోయాను. ఆ సారథికీ ఈ సారథికీ అట్టే వ్యత్యాసం లేదు. అప్పుడు బాగా బక్కపలచగా వుండేవాడు; ఇప్పుడు కాస్త బలం వచ్చినవాడుగా వున్నాడు. మనిషిలో వయసు తెచ్చిన గంభీరత్వం కూడా వుంది. అనారోగ్యంతో చిక్కిపోయి కూడా ఆ ముఖం ఎంత ఆకర్షణీయంగా వుంది! నిద్రలో అతని ముఖంలో కన్పిస్తున్న ప్రశాంతత నా దురదృష్టాన్ని వెక్కిరించసాగింది.

లేచి మందు ఇచ్చాను. బద్ధకంగా బరువుగా మూతలు పడుతున్న కళ్ళతో మందు తాగేశాడు. థర్మామీటర్ నోట్లోపెట్టి వూరుకున్నాడు. నోట్లోంచి విసురుగా తీస్తూండగా.

"నర్స్ ఇందాక ఎందుకలా పారిపోయావు?" అన్నాడు అప్పటికే అతని కళ్ళు మళ్ళీ మూతలు పడుతున్నాయి.

నేను సమాధానం చెప్పలేదు.

అతనింకేమీ అడగలేదు.

బయటకి వచ్చేశాను. అతను నన్ను గుర్తుపట్టలేదు. ముఖాముఖీ చూసి కూడా పోల్చుకోలేదు. ఈ దారుణమయిన సత్యం నా గుండెల్ని వేయి రంపాలతో చీల్చసాగింది. ఏమయినాసరే, రేపు ఉదయం ఎదురు పడాలి. ఒకవేళ గురుపట్టకపోతే ఫలానా అని గుర్తు చేయాలి. గుర్తు చేసి అతనెలా ప్రవర్తిస్తాడో చూడాలి. గట్టిగా నిశ్చయించుకున్నాను.

మర్నాడు పగలు డ్యూటీ మేరీది.

సాయంత్రం వరకూ వేచివుండక తప్పలేదు.

రాత్రి 7-8 గంటల మధ్య మందు తీసుకుని వెళ్ళాను. అతను మంచంమీద కూర్చుని పుస్తకం తిరగేస్తున్నాడు. నిన్నటికంటే కులాసాగానే వున్నాడు. అతనెలాగో నన్ను గుర్తుపట్టలేదు. ధైర్యంగా నిస్సంకోచంగా దగ్గిరకు వెళ్ళి మందిచ్చాను. మందుగ్లాసు అందుకుంటున్న అతను క్షణంసేపు నావేపు చూశాడు. నేను కూడా చూశాను. ఇద్దరి చూపులూ కలుసుకుని పెనవేసుకున్నాయి. అతను వింతగా ప్రశ్నార్థకంగా చూశాడు. చూస్తూండగానే అనారోగ్యంతో చిక్కిపోయిన అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి. మందుగ్లాసు పట్టుకున్న నా చేయి వణికింది.

"శైలూ!" పెదవులు అస్పష్టంగా పలికినాయి. కళ్ళు ఇంకా కలా, నిజమా అన్నట్టు అలాగే అపనమ్మకంతో గుచ్చి చూస్తున్నాయి.

"నేనిక్కడ నర్స్‌ని- శైలజని కాదు."

"అదే, ఎందుకని? ఎలా - నువ్విక్కడ" అతను తడబడుతున్నాడు.

"మందు తీసుకోండి."

"అయితే, నువ్వు-నువ్వేనా-నన్నిలా జాగ్రత్తగా చూసింది!"

నేను సమాధానం చెప్పలేదు. ఆ మాటలూ, ఆ పలికే తీరూ చూస్తూంటే అతను నన్ను నేను అనుకున్నంతగా మర్చిపోలేదని తెలుస్తోంది.

"నువ్వు నువ్వు వేరే పెళ్ళి చేసుకోలేదూ!"

"అంతా మీలా వుండరు. విడిచిన బట్టని తీసివేసినట్టు మనుషుల్ని జీవితాల్లోంచి తీసిపారెయ్యటం అందరికీ సాధ్యం కాదు!"

క్షణం సేపు భయంకరమయిన నిశ్శబ్దం ఏర్పడింది.

"మందు తీసుకోండి. మీరిక్కడ నన్ను చూసి భయపడాల్సిన అవసరం ఏమీలేదు. శైలజ మీరు వదలేసిననాడే చచ్చిపోయింది. ఇప్పుడు ఇక్కడుంది కేవలం నర్స్. ఆ నర్స్ ఏ విధంగానూ మీ జీవితంలో ప్రవేశించదు. పాత బంధాన్ని పైకి తీయాలని ప్రయత్నం చేయదు."

అతడు నా చేతిలో మందుగ్లాసు వదిలేసి వెనక్కు తగ్గాడు. హటాత్తుగా షాక్ తిన్న అతని ముఖం పాలిపోయి నీరసంగా మారడంనేను గమనించకపోలేదు.

"అయితే ఉత్తరం వ్రాస్తూ నిన్న నువ్వు పారిపోయింది...."వాక్యం పూర్తిచేయకుండా ఆపేశాడు.

నేను వంచిన తల యెత్తలేదు. అడగాలని సిద్ధం చేసుకున్న మాటలన్నీ గాలిలో కలిసిపోయినాయి. మాటలు రాని మూగదానిలా నిలబడి పోయాను.

హఠాతుగా ముందుకు వంగి నా చెయ్యి పట్టుకుంటూ "నిజం చెప్పు. ఇన్నాళ్ళ నీ జీవితంలో నేను నిష్క్రమించిన తర్వాత యింకెవరూ రాలేదా?" అన్నాడు.

"నేను రానివ్వలేదు."

అప్రతిభుడైనట్టు చూశాడతను.

"మీరు మందు తాగితే నేను వెళ్ళిపోతా–" నాకక్కడ వూపిరి ఆడటంలేదు.

అతను సమాధానంగా రెండు చేతులూ పట్టి మంచం మీదికి లాగాడు. అనుకోకుండా అతను చేసిన పనితో అతని దగ్గరగా మంచం మీద కూలబడ్డాను. వెంటనే లేవబోయాను. కాని లేవనీయలేదు. నా

చెయ్యి గట్టిగా పట్టుకుని, "నిన్ను—నిన్నిలా మళ్ళీ చూస్తానని కల్లోకూడా అనుకోలేదు." అంటుండగానే అతని కంఠం వణికింది. అతన్ని చూసి నప్పటినుంచీ యీ క్షణం వరకూ నేను మూగగా అనుభవిస్తున్న దుఃఖానికి ఆ మాట అనకట్టలు తెంచింది.

"శైలూ! శైలూ!—" ఆప్యాయంగా దగ్గరకి తీసుకుని జుట్టుని సవరించాడు; చెక్కిళ్ళని నిమిరాడు. అలా ఏంతసేపు అతని చేతుల మధ్య యిమిడిపోయి యేడుస్తూండిపోయానో నాకు స్పృహలేదు.

అర్ధరాత్రి దాటింతర్వాత అతన్ని బలవంతంగా నిద్రపుచ్చి బైటికి వచ్చాను. ఎన్నికబుర్లు! ఇన్ని సంవత్సరాల యీ వియోగంతో నాపట్ల అతని అనురాగం ఆవగింజ కూడా తగ్గలేదు. తల్లి బలవంతంమీద పెళ్ళి చేసుకున్నమాట నిజమే కాని ఆవిడ రెండు సంవత్సరాల్లోనే పోయింది. నాకోసం తర్వాత వెతికాడుట. ఆ వూరువెళ్ళి వాకబుచేసే వెళ్ళిపోయిందనీ, యెవరినో పెళ్ళిచేసుకుందనీ చెప్పారుట. గదిలోంచి బయటికి రాగానే చల్లటిగాలి నా ముఖానికి తగిలింది. తేలికగా నిట్టూర్చాను. మనసులోని కొండంత భారం దిగింది.

ఆ మర్నాడు అర్జంట్ కేసు వచ్చి ఆపరేషన్ గదిలో వుండడం వల్ల అతని దగ్గరికి వెళ్ళలేకపోయాను. దాదాపు సాయంత్రం నాలుగవుతుండగా గబగబా అతని గదిలోకి పరుగెత్తాను. ఎప్పుడెప్పుడు చూస్తానా అన్న ఆత్రం నన్ను వుదయంనుంచీ ఆవేశించింది.

దాదాపు పరుగెత్తుకొస్తున్న నేను గదిలోకి వచ్చీరాగానే మీట నొక్కినట్లు ఆగిపోయాను. గదిలో సారథి మంచంమీద అతని గుండెల కంటుకుపోయి ఒకావిడ వెక్కి వెక్కి యేడుస్తోంది—అతను ఓదారుస్తున్నాడు.

సారథి నన్ను చూడకపోతే గిరుక్కున వెనక్కుతిరిగి వెళ్ళిపోయేదాన్ని. కాని సమయం మించిపోయింది.

"అదుగో నర్సు వచ్చింది, లే కమలా" భార్యని బలవంతంగా భుజాలు పట్టి లేవదీస్తూ అన్నాడు. ఆ మాట లనేప్పుడు అతని ముఖం యెర్రబడటం నేను గమనించకపోలేదు.

ఆవిడ సరిగ్గా కూర్చుని చీరచెంగుతో కళ్ళు తుడుచుకుంది.

నేను మరో రెండు నిమిషాల్లో క్షమార్పణ చెప్పుకుని, సారధి పిలుస్తున్నా విన్పించుకోకుండా బయటికి వచ్చేశాను.

అన్నిటికంటే భయంకరమైన సత్యం, రాత్రి నేను సరిగ్గా అలాగే అతని గుండెల్లో తలదాచుకుని యేడ్చాను. కాని నా ఏడుపుకీ ఆమె ఏడుపుకీ ఎంత వ్యత్యాసం. ఇక్కడ తెలిసినవాళ్లెవరో సారధికి ఒంట్లో బాగాలేదని టెలిగ్రాం యిస్తే పరుగెత్తుకు వచ్చింది. అదుర్దా పడడంలో ఆవిడకి ఆ అధికారం వుంది. కాని నాకు—నేనెవర్ని అతనికి?

మర్నాడు పద్మ ద్వారా నాకు ఆవిడ ఓ కంచి పట్టుచీర, పళ్లు, పువ్వులు పంపింది. వాటితో "నీఋణం జన్మలో తీర్చుకోలేను. నా భర్తని నాకు ప్రసాదించిన అమృతమూ ర్తివి నువ్వు. నా యీ చిన్న కానుకని స్వీకరించు—కమల" అని ఒక చీటీ వుంది. నేను వాటిని తిప్పి పంపేస్తూ "నా ధర్మాన్ని నేను నెరవేర్చాను. ఈ కృతజ్ఞతలు అనే ఆడంబరంతో నన్ను అవమానించవద్దు—నర్స్" అని వ్రాసి పంపాను.

"వాళ్ళు వెళ్ళిపోయే ముందు నిన్ను చూసితీరాలిట. నువ్వు రాక పోతే రేపు మనింటికి వాళ్లే స్వయంగా వస్తారుట" అంది పద్మ.

"రానీ, రేపు నేనిక్కడ వుంటేకదా?" అన్నాను నిర్లక్ష్యంగా.

"అంటే...." పద్మ కింతవరకూ అసలు సంగతి తెలియదు.

"నేను ఉద్యోగం మానేస్తున్నాను."

"నీకేమైనా మతిపోయిందా?"

"ఇక్కడుంటే పోతుందని భయంగా వుంది. సాయంత్రమే బాబాయి దగ్గరికి వెళ్ళిపోతున్నాను."

"శైలూ! నన్ను చంపక, అసలు విషయం చెప్పు." పద్మ ప్రాధేయపడింది.

క్లుప్తంగా జరిగినదంతా చెప్పాను.

"నువ్వెంత గట్టిదానివి. ఇన్నిరోజులనుంచి నాకు ఒక్కమాట అయినా చెప్పలేదు" నిష్ఠూరంగా అంది పద్మ.

కొద్దిసేపయింతర్వాత "నువ్వు అతన్ని తప్పించుకోవాలని ఉద్యోగం మానేస్తానంటున్నావు. కాని ఎక్కడున్నా నిన్నతను పట్టు కోడని ఏం నమ్మకం?" అంది.

అదీ నిజమే అన్పించింది

ఏమైనా సరే, ఆ రాత్రే కొద్ది రోజులు ఆ ఊరునుంచి వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాను! పద్మ ద్వారా డాక్టరుగారికి శలవు వ్రాసి పంపాను.

ఇంతలో వీధి తలుపు చప్పుడైంది.

"వస్తున్నా పద్మా" అంటూ వెళ్ళి తలుపుతీశాను. తీస్తూనే కొయ్యబారిపోయాను. ఎదురుగుండా సారథి నిలబడివున్నాడు!

"శైలూ" అతను నవ్వబోయాడు. కాని నవ్వు రాలేదు. లోపలికి రావటానికి తప్పనిసరిగా దారి యివ్వాల్సి వచ్చింది.

"ఊరు వెడ్తున్నావని పద్మ చెప్పింది నిజమేనా?"

నమ్మకద్రోహి, కృతఘ్నురాలు! స్నేహం అన్నపదంలో పవిత్రతనే చెడగొట్టింది. పద్మమీద ఒళ్ళు మండిపోయింది.

"ఎక్కడికి వెళ్తావు?"

"బాబాయి వరస అయిన దూరపుబంధువు ఒకాయన వున్నాడు. ఆయనే నాకిదంతా చేసింది. ఆయన దగ్గరికి వెడ్తాను."

"ఇప్పుడంత అవసరం ఏమొచ్చింది?"

"నా కిక్కడ బాగాలేదు."

"నా మూలంగానేగా?"

నేను మాట్లాడలేదు.

అతను దగ్గరగా వచ్చాడు. "శైలూ! మళ్ళీ కంటికి కన్పించిన తర్వాత నిన్నిలా ఒంటరిగా వదిలేస్తాననే నమ్ముతున్నావా?"

"వదిలేయక చేసేదేముంది?"

"నా ఇంటికి తీసుకువెడ్తాను. ఉద్యోగం వదిలేయాలని వుంటే వదిలెయ్. కాని నా భార్యగా నా ఇంటికిరా."

"కమల?"

"కమలకి నేనంతా చెప్పేస్తాను. ఇప్పుడే ఈ క్షణంలోనే చెప్పేవాడిని. కాని కమల గుండెజబ్బు మనిషి. కొద్దిగా చెమ్మదిగా, ప్రశాంతంగా చెప్పాలి. అందుకే ఈ రోజే మేం ఇద్దరం వెళ్ళిపోతున్నాం. నాలుగు రోజులలో నిన్ను తీసుకెళ్ళటానికి వస్తాను."

"కమల ఒప్పుకోకపోతే?"

"ఒప్పుకొంటుంది" దృఢంగా అన్నాడు.

ఇద్దరిమధ్యా మౌనం ఏర్పడింది.

"కానీ, కానీ, నా జాతకం మంచిదికాదు. నన్ను-" అతను మధ్యలోనే ఆపుచేశాడు. "అయినా ఫర్వాలేదు. మొన్న జ్వరంలో ఈ జీవితం కేవలం నువ్వు ప్రసాదించిందే!"

నాలుగురోజుల్లో తిరిగివచ్చి నన్ను తీసుకువెళ్ళేటట్లు, ఈ లోపల నేనే పిచ్చి పనులూ చేయకుండా అతనికోసం ఎదురుచూసేట్టు వాగ్దానం చేయించుకుని సారథి వెళ్ళాడు.

శిలా ప్రతిమలా అలాగే కూర్చుండిపోయాను. అతనెంత ఆదరంగా చూడనీ, యెన్ని వాగ్దానాలయినా చెయ్యనీ తిరిగి అతని జీవితంలో నేను ప్రవేశించలేను. కమల అతని మాటలకి యెదురాడే సాహసం లేక ఒప్పుకోవచ్చు కాని కళ కళలాడే ఆ సంసారం మధ్య నేనెలా వుంటాను. నేనేం చెయ్యాలి? అతను తిరిగివచ్చేంతవరకూ వేచివుంటానని ఇచ్చినమాట నిలుపుకోవటమాలేక నిర్లక్ష్యంగా వెళ్ళిపోవడమా? భగవాన్! నాకు సరైన మార్గం చూపించు. మనసులో భగవంతుడిని వేడుకోసాగాను. నాకు తెలియకుండానే నా కళ్ళనుంచి నీళ్ళు కారసాగాయి. సారథి నన్ను మర్చిపోలేదు. అతని మనసులో నా స్థానం చెక్కుచెదరలేదు. ఆ తృప్తి చాలదూ నాకు!

"అమ్మాయ్ హాస్పిటల్‌నుంచి నీకు ఫోన్ వచ్చింది."

ఇంటిగలావిడ కేకవేయడంతో ఉలిక్కిపడి కళ్ళు తుడుచుకున్నాను. బహుశా డాక్టరుగారయి వుంటారు శలవు ఇవ్వటానికి ఒప్పుకోక ఫోన్‌చేసి వుండవచ్చు.

"ఇంట్లో లేనని చెప్పండి పిన్నిగారూ" అన్నాను.

నేను వెళ్ళిపోతాను. సారథి కిచ్చినమాట నిలుపుకోను. అందులోనే అతని మంచితనం వుందని నా విశ్వాసం. లేచివెళ్ళి బట్టలు సర్దుకోవటం ప్రారంభించాను.

"అమ్మా! పద్మ తల్లి నిన్ను పిలుస్తోంది" మళ్ళీపిల్చింది. ఆవిడ పద్మ పేరు చెప్పగానే నాకు ఇంకా ఒళ్ళు మండింది. తను చేసిన ఘన కార్యం యెలా పరిణమించిందో ఫలితం తెలుసుకోవాలని ఆత్రం కాబోలు!

"సారథితో వెళ్ళానని చెప్పండి" అన్నాను కరకుగా.

రెండు నిమిషాల్లో పిన్నిగారి కంఠం మళ్ళీ కంచుగంటలా మోగింది. "అబ్బబ్బ, నాకు తెలియదమ్మా! నువ్వు వచ్చి మాట్లాడు. అర్జెంట్ అంటోంది, ఎవరికో యాక్సిడెంట్ అయ్యిందట" ఆవిడ విసుక్కుంది.

నేను చీరెలు మంచంమీద పడేసి ఫోన్ దగ్గరికి వెళ్ళాను.

"హలో శైలూ, నువ్వేనా?"

"ఆ! యేం మహారాణీ!"

"శైలూ! సారథి...."

"వచ్చాడు, వెళ్ళాడు. నిన్ను జన్మలో క్షమించను."

"అబ్బబ్బ! మాటవిను. అతనికి యాక్సిడెంట్ అయింది. హాస్పి తీసుకువచ్చారు. నువ్వు త్వరగా రా!

"ఆఁ!"

"నిజం. త్వరగా రావాలి దెబ్బలు బాగా తగిలాయి. తలమీద ద్ద గాయం అయింది. ఆపరేషన్ థియేటర్‌లో వున్నాడు."

"పద్మా!" బిగుసుకుపోతూ పిల్చాను.

"నాకు టైమ్‌లేదు. నువ్వు వచ్చెయ్యి." పద్మ ఫోన్ పెట్టేసింది.

హాస్పిటల్‌కి ఎలా వెళ్ళానో నాకే గురులేదు నేను వెళ్ళేసరికి చాలా వుడిగా వున్నారంతా. నన్నుచూడగానే పద్మ పరుగెత్తుకొచ్చేసింది. ంనిండా చెమటలు పట్టాయి "ఇంత ఆలస్యం అయిందేం?" అంది.

"రిక్షా దొరకలేదు. ఎలా వుంది?"

"రా! చూద్దువుగాని" పద్మచెయ్యి పట్టుకుని లాక్కెళ్ళింది. ఆపరేషన్ టేబుల్‌మీద వున్నాడు తలమీద చాలా పెద్దగాయాలున్నట్టు బాండేజ్ చెపుతోంది.

న్నిద పోతున్నట్టు నిలువుగా పడుకున్న అతనిమీదపడి, కమల రోదిస్తోంది.

గుమ్మంలో ఎదురైన డాక్టర్ నన్ను చూసి తలవూపుతూ "చాలా ట్రాజెడీ! అంత జబ్బును కోలుకొని ఇలా అకస్మాత్తుగా పోవటం! హు! మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో ఎవరికి తెలుసు?" అన్నారు.

పద్మ నా చెయ్యి గట్టిగా పట్టుకుంది.

ఇంకో నర్సు అతని ముఖంమీద గుడ్డ కప్పేసింది. కమల గొల్లుమంది.

పద్మ నా చెవిలో రహస్యంగా "ఆఖరిసారి అతను శైలూ—శైలూ అన్నాడు తెలుసా?" అంటోంది! కానీ నా కివేవీ విన్పించట ప్రపంచం అంతా గిర్రున తిరుగుతోంది. నేను ఎక్కడికో అ అఘాతంలోకి జారిపోతున్నాను. వెంటనే కెవ్వుమన్నాను. ఏమైందో నాకు తెలియదు.